క్లుప్తంగా

కంచి కామాక్షమ్మను పూజిస్తే అనుగ్రహం

భట్టిప్రోలు: శ్రావణ మాసంలో కంచి కామక్షమ్మ అమ్మవారిని పూజిస్తే ఆమె అనుగ్రహం కలుగుతుందని మండల ధార్మిక మండలి అధ్యక్షురాలు బూర్లె అరుణకుమారి పేర్కొన్నారు. శ్రావణమాసం పర్వదినాలు పురస్కరించుకుని శనివారం భట్టిప్రోలు పంచాయతీ పరిధిలోని అద్దేపల్లికి చెందిన బొలిశెట్టి సునీల్‌కుమార్–శ్రీ లక్ష్మి దంపతుల స్వగృహంలో పారాయణ కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో ఎం. స్వరూపరాణి, నళిని, సునీత, గృహలక్ష్మి, హేమలత, బి.ధనలక్ష్మి, హారిక, ఎం.ధనలక్ష్మి, శశికళ, పావని, సూర్యప్రభ, కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

జై భీమ్ ఫెడరేషన్ అమర్తలూరు మండల కన్వీనర్‌గా రవి

అమర్తలూరు(వేమూరు): జై భీమ్ ఫెడరేషన్ నూతన కమిటీ ఏర్పాటు చేసినట్లు ఫెడరేషన్ వ్యవస్థాపకులు కొవెవరపు దేవానంద్ తెలిపారు. తెనాలి జై భీమ్ ఫెడరేషన్ కార్యాలయంలో నూతన కమిటీ శనివారం ఎన్నుకున్నారు. అమర్తలూరు మండల కన్వీనర్‌గా దేవరకొండ రవిని నియమించినట్లు తెలిపారు. జై భీమ్ ఫెడరేషన్ ద్వారా అనేక స్వచ్ఛంద కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాలలో మండల, జిల్లా, నియోజకవర్గ కమిటీలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కొత్తపల్లి రవీంద్రబాబు, కనపర్తి అబ్రహం లింకన్, బేతాళ భూషణం, సుద్దపల్లి కనకరాజు తదితరులు పాల్గొన్నారు.

బాపట్లలో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలు



బాపట్ల అర్బన్: బాపట్ల పట్టణంలో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమం చేపడుతున్నట్లు మున్సిపల్ కమిషనర్ జి.రఘునాథరెడ్డి పేర్కొన్నారు. పట్టణంలో డ్రైయినేజీలో పూడికతీత పనులు చేపట్టారు. పెద్ద డ్రైనేజీల నుంచి అంతర్గత డ్రైయినేజీల్లోకి కలిసే వాటిని వెంటనే శుభ్రం చేయించాలని శానిటరీ ఇన్‌స్పెక్టర్ నజీర్, సీహెచ్ కరుణను ఆదేశించారు. ఎక్కడైనా డ్రైయినేజీలు అపరిశుభ్రంగాఉంటే వెంటనే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకుపోవాలని సూచించారు.

కనుల పండువగా గరుడ సేవ



చేబ్రోలు: చారిత్రక ప్రసిద్ధి చెందిన చేబ్రోలులోని శ్రీ భూ నీలా సమేత ఆదికేశవ స్వామి దేవస్థానంలో శనివారం రాత్రి పున్నమి గరుడ సేవ కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు ఫణిహారం శ్రీధర్ ఆధ్వర్యంలో వివిధ కార్యక్రమాలు జరిగాయి. శ్రావణ పౌర్ణమి సందర్భంగా నిర్వహించిన గరుడ సేవ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఆదికేశవ స్వామికి ప్రత్యేక పూజలు, విశేష కార్యక్రమాలు నిర్వహించారు. స్వామివారి గ్రామోత్సవం కనుల పండువగా జరిగింది. గరుడ సేవలో ఆదికేశవ స్వామి గ్రామంలోని పురవీధులలో ప్రత్యేక అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు.

గుట్టుగా గుట్కా విక్రయాలు



పొన్నూరు: మండల పరిధిలోని గ్రామాలు, పట్టణంలోని విద్యాసంస్థల పరిసరాల్లో పొగాకు ఉత్పత్తుల (గుట్కా, ఖైనీ) విక్రయాలు గుట్టుచప్పుడు కాకుండా సాగుతున్నాయి. నిషేధిత ప్రాంతాల్లో విక్రయాలపై అధికారులు చర్యలు చేపడుతున్నా గుట్కా, ఖైనీ విక్రయాలకు అడ్డుకట్ట పడటం లేదు.పెట్టుబడి తక్కువ, లాభం ఎక్కువ రావడంతో పలువురు వ్యాపారులు అత్యాశతో అమ్మకాలు జరుపుతున్నారు. బడ్డీ, కిరాణా దుకాణాల్లో ఉంచి విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. ఒక్క ప్యాకెట్ విక్రయిస్తే రూ.10 వరకు లాభం రావడంతో దుకాణదారులు వీటి అమ్మకాలపై ఆసక్తి చూపుతున్నారు. విద్యాసంస్థల పరిసర ప్రాంతాలలో ఖైనీ, గుట్కాల అమ్మకాలపై అధికారుల దాడులు కొన్నేళ్లుగా తగ్గుముఖం పట్టాయి. దీంతో ప్రతి దుకాణంలో గుట్కా, ఖైనీలతో పాటు విదేశీ సిగరెట్ల అమ్మకాలు యథేచ్ఛగా కొనసాగిస్తున్నారు.

కేసులు నమోదు చేస్తున్నాం

ఆపరేషన్ సేఫ్ జోన్‌లో భాగంగా విద్యాసంస్థల వద్ద పొగాకు ఉత్పత్తులు విక్రయించే వారిపై కఠినంగా వ్యవహరిస్తున్నాం. ఇటీవల 15 మంది బడ్డీ, కిరాణా దుకాణ నిర్వాహకులకు రూ.3 వేలు జరిమానా విధించాం. నిషేధిత ప్రాంతాల్లోని దుకాణ సముదాయాల్లో పొగాకు ఉత్పత్తుల విక్రయాల నియంత్రణకు ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహిస్తున్నాం.

రెడ్‌బుక్ పేరుతో అక్రమ కేసులు



అద్దేపల్లి గ్రామంలో బాబు షూరిటీ, మోసం గ్యారెంట్ కార్యక్రమంలో వరికూటి అశోక్‌బాబు



అదేపల్లి గ్రామంలో వరి కూటి అశోక్‌బాబు సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన తెలుగుదేశం కార్యకర్తలు

- వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త అశోక్‌బాబు
- అద్దేపల్లిలో 'బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ' కార్యక్రమం

భట్టిప్రోలు(వేమూరు): కూటమి ప్రభుత్వం రెడ్‌బుక్ పేరుతో అక్రమ కేసులు పెట్టి ప్రతిపక్ష పార్టీ నాయకులు, కార్యకర్తలను ఇబ్బందులకు గురి చేస్తోందని వైఎస్సార్ సీపీ నియోజకవర్గం సమన్వయకర్త వరికూటి అశోక్‌బాబు విమర్శించారు. భట్టిప్రోలు పంచాయతీ పరిధిలోని అదేపల్లి గ్రామంలో శనివారం 'బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ' కార్యక్రమం నిర్వహించారు. ప్రతి గడపకు వెళ్లి కూటమి ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలను, సూపర్ సిక్స్ హామీల అమలుతీరును ప్రజలకు వివరించారు. పులివెందుల నియోజకవర్గంలో జెడ్పీటీసీ ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ నాయకులపై, కార్యకర్తలపై దాడులు చేసి భయభ్రాంతులకు గురి చేస్తున్నారన్నారు. అర్హులైన అనేక మందికి తల్లి వందనం అందించకుండా ఎగనామం పెట్టారని తెలిపారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలుచేసిన సంక్షేమ పథకాల వల్ల ప్రతి పేద కుటుంబం సంపదతో కళకళలాడిందన్నారు. కూటమి ప్రభుత్వంలో సంక్షేమ పథకాల అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని విమర్శించారు. కూటమి ప్రభుత్వం పాలనపై ప్రజలు విసుగు చెందుతున్నారన్నారు. తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు పలువురు వరికూటి అశోక్‌బాబు సమక్షంలో వైఎస్సార్ సీపీ చేరారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ పడమటి శ్రీనివాసరావు, ఎంపీపీ దావూరి లలితకుమారి, వైస్ ఎంపీపీ కొతరపు పిచ్చయ్యశాస్త్రి, మల్లేశ్వరరావు, పార్టీ జిల్లా ప్రతినిధి సయ్యద్ సిరాజుద్దీన్, కుందేటి రమేష్, ఎంపీటీసీ సభ్యురాలు కొతరపు పద్మావతి, వైఎస్సార్‌సీపీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

డెంగీని అరికట్టడం అందరి బాధ్యత

- బాపట్ల జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ విజయమ్మ
- భట్టిప్రోలులో ఒకరికి డెంగీ జ్వరం
- ఇంటింటి సర్వే చేస్తున్న వైద్య సిబ్బంది



భట్టిప్రోలు పీహెచ్‌సీలో వైద్యురాలు, సిబ్బందిని అడిగి వివరాలు తెలుసుకుంటున్న డీఎంహెచ్‌ఓ



ఐలవరంలో ఇంటింటికి వెళ్లి సర్వే చేస్తున్న కార్యదర్శి సురేష్, వైద్య ఆరోగ్య సిబ్బంది

భట్టిప్రోలు: డెంగీని అరికట్టడం అందరి బాధ్యత అని బాపట్ల జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎస్.విజయమ్మ అన్నారు. భట్టిప్రోలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శనివారం డీఎంహెచ్‌ఓ వైద్యురాలు మోహాసీనా తాజ్‌తో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ డెంగీ నివారణ మన చేతిలోనే ఉందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, వైద్యాధికారుల సలహాలు, సూచనలు పాటించి, డెంగీని పూర్తిగా పారద్రోలాలని అన్నారు. గ్రామాల్లో ఫాగింగ్ చేయడం, నీటి నిల్వ గుంటల్లో ఆయిల్ బాల్స్ వేయడం, గంబూషియా చేపలను వదలడం ద్వారా దోమల పెరుగుదలను అరికట్టవచ్చని వివరించారు.

అందుబాటులో మందులు

వ్యాధులు ప్రబలకుండా మందులు అందుబాటులో ఉంచామని డీఎంహెచ్‌ఓ తెలిపారు. రోగులు ఏ సమయంలో వచ్చినా చికిత్స అందించే విధంగా చూస్తామన్నారు. డెంగీ కారక దోమల బెడద నుంచి రక్షించుకోవడమే శ్రేయస్కరమని హెచ్చరించారు. వర్షాల సీజన్‌లో సాధారణంగా డెంగీ వ్యాపిస్తుందని, ఈ జ్వరం వస్తే శరీరంలోని తెల్ల రక్త కణాల సంఖ్య తగ్గి ప్రాణాంతకంగా మారుతుందని తెలిపారు. వైద్య ఆరోగ్య సిబ్బందితో పాటు సీహెచ్‌వో బంకా మంగరాజు, హెల్త్ ఎడ్యుకేటర్ వెంకట పద్మావతి, హెల్త్ విజిటర్ రుసుముల్లా, ఏఎన్‌ఎంలు, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

ఇంటింటికి వెళ్లి సర్వే

ప్రజాప్రతినిధులు, పంచాయతీ అధికారులు, ఆశా కార్యకర్తలు ప్రతి ఇంటికి వెళ్లి జ్వరాలు ఏమైనా ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. ప్రతి శుక్రవారం డ్రై డే పాటించేలా చర్యలు చేపడుతున్నారు. డ్రమ్ములు, పాత టైర్లు వంటి వాటిలో నీరు నిల్వ ఉంటే అందులో దోమలు వృద్ధి చెంది డెంగీ, తదితర విష జ్వరాలు వచ్చే అవకాశం ఉందని తెలియచేశారు. గ్రామంలో పారిశుద్ధ్య నిర్వహణలో భాగంగా సర్పంచ్ దారా రవి కిరణ్మయి ప్రత్యేక శ్రద్ధ తీసుకుని ఎంపీడీవో–2 ఈపూరు విజయబాబు, పంచాయతీ ఇన్‌చార్జి కార్యదర్శి మామ్జీనాయక్, రేపల్లె మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ వైవీ కృష్ణయ్యలు బ్లీచింగ్, సున్నం చల్లించటమే కాక ఎబెట్ చల్లించారు.

ఐలవరంలో ఇంటింటి సర్వే

ఐలవరం(భట్టిప్రోలు): జిల్లా కలెక్టర్ ఆదేశానుసారం భట్టిప్రోలు మండలం ఐలవరం–2 సచివాలయం పరిధిలో ఇంటింటికి వెళ్లి వైద్య ఆరోగ్య సిబ్బంది, పంచాయతీ అధికారులు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శి వక్కలగడ్డ సురేష్ మాట్లాడుతూ ముఖ్యంగా డెంగీ జ్వరం రావడానికి కారణాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలతోపాటు అందుబాటులో ఉన్న ప్రభుత్వ వైద్య సదుపాయాలను వివరించారు. నీటి నిల్వలు అధికంగా ఉన్న ప్రాంతాల్లో ఎబెట్ చల్లి లార్వా నివారణ చర్యలు చేపడుతున్నారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ మహాలక్ష్మి, ఏఎన్ఎం రజని, బీసీ అంకమ్మరావు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా పౌర్ణమి సామూహిక హారతులు



సామూహిక హారతులు ఇస్తున్న మహిళలు

రేపల్లె: శ్రావణ శుద్ధ పౌర్ణమిని పురస్కరించుకుని శనివారం సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో చెరుకుపల్లి మండలం పిట్టుకోటిరెడ్డిపాలెం శ్రీ కోదండ రామాలయంలో పౌర్ణమి సామూహిక హారతులు సమర్పించి భజన సంకీర్తనలు, లక్ష్మి అమ్మవారికి కుంకుమార్చన కార్యక్రమాలు చేశారు. జిల్లా దేవాలయ ప్రముఖ్ పొన్నపల్లి సత్యనారాయణ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ దీపం పరబ్రహ్మ స్వరూపం అని సామూహిక హారతుల వల్ల సైన్స్ పరంగా కూడా వాతావరణంలో చెడుక్రిములు చనిపోయి వాతావరణ సమతుల్యం ఏర్పడుతుందని తెలిపారు. ఆరోగ్యపరంగా కంటి వ్యాధులు తొలుగుతాయని దృష్టి దోషాలు తొలిగి స్వామివారి అనుగ్రహం కలిగి అందరికీ శుభం కలుగుతుందని తెలియజేశారు. కార్యక్రమంలో జిల్లా పరియోజన ప్రముఖ్ పడమట వెంకటేశ్వరరావు, ధర్మ ప్రచారకులు జంజనం హేమశంకరరావు, చీరాల కుమారస్వామిరెడ్డి, వీరాస్వామిరెడ్డి, చింతల మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

గుంటూరులో 99 అడుగుల మట్టి గణపతి



గుంటూరు రూరల్ : గుంటూరులో అమరావతి పేరుతో 99 అడుగుల మట్టి వినాయక విగ్రహం ఏర్పాటు చేయడం అభినందనీయమని కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. శనివారం ఆయన కార్యాలయంలో వినాయక విగ్రహం నమూనా, ఉత్సవ ఏర్పాట్లు చెందిన వెబ్‌సైట్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్లాస్టర్ ఆఫ్ ప్యారీస్ లేకుండా, ప్లాస్టిక్ వినియోగించకుండా ప్రకృతి సిద్ధమైన మట్టి, పుణ్య నదులైన గంగా, కృష్ణ, గోదావరిల నీటితో విగ్రహం తయారు చేయడం గొప్ప విషయమన్నారు. ఉత్సవ కమిటీ చైర్మెన్ ఎం.నరేంద్ర మాట్లాడుతూ గణేశుని విగ్రహం వద్ద ఆగష్టు 27 నుంచి సెప్టెంబర్ వరకు 21 రోజులు నిత్య పూజలు, హోమాలు, యాగాలు జరుగుతాయన్నారు. ఇన్నర్‌రింగ్‌రోడ్డు, రెడ్డిపాలెం వద్ద ఈ వినాయక విగ్రహాన్ని ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. రాష్ట్ర నలుమూలల నుంచి భక్తులు రావడానికి దర్శించుకోవడానికి ఏర్పాట్లు చేస్తున్నామని తెలియజేసారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు వైస్ చైర్మన్ లక్ష్మీనారాయణరెడ్డి, తోట సాయికృష్ణ, జాకీరు, దామోదర్, గంటా స్వామి, దుర్గారెడ్డి, జి.విజయగౌరి తదితరులు పాల్గొన్నారు.

అవయవదానంతో మరణించినా జీవించవచ్చు



అవయవదానంపై లఘునాటిక ప్రదర్శిస్తున్నట్లు నర్సింగ్ విద్యార్థులు

జీజీహెచ్ సూపరింటెండెంట్ రమణ

గుంటూరు మెడికల్: అవయవదానంతో మనిషి మరణించినా జీవించవచ్చని, తాను మరణిస్తూ మరో పది మందికి నూతన జీవితాన్ని ప్రసాదించవచ్చని గుంటూరు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ యశస్వి రమణ అన్నారు. అంతర్జాతీయ అవయవదాన వారోత్సవాల సందర్భంగా శనివారం గుంటూరు జీజీహెచ్‌లో అవయవదానంపై ఆస్పత్రికి వచ్చిన రోగులు, వారి సహాయకులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అందులో భాగంగా సూపరింటెండెంట్ కార్యాలయం ఎదుట నర్సింగ్ విద్యార్థులు అవయవదాన ప్రాధాన్యం తెలిసేలా లఘునాటిక ప్రదర్శించారు. ర్యాలీగా ప్లకార్డులు పట్టుకుని ఆస్పత్రి చుట్టూ ర్యాలీ చేశారు. ఆస్పత్రి శుశ్రుత హాలులో వైద్యులు, వైద్య సిబ్బంది సమావేశమై అవయవదాన ప్రతిజ్ఞ చేశారు. ఈసందర్భంగా డాక్టర్ యశస్వి రమణ మాట్లాడుతూ అవయవదానంపై ప్రజల్లో అపోహలు, అనుమానాలు ఉన్నాయని, అందువల్లే అనేక మంది చనిపోయిన తరువాత శరీరాన్ని కాల్చడం, లేదా, పూడ్చడం చేస్తున్నారన్నారు. బ్రెయిన్ డెడ్ అయిన వారి కుటుంబ సభ్యులు అవయవదాన ప్రాధాన్యాన్ని గుర్తించి అవయవాలు దానం చేయడం ద్వారా ప్రాణాపాయ స్థితిలో ఉన్న రోగులకు నూతన జీవితాన్ని ప్రసాదించి, అమరులుగా మిగిలిపోతారన్నారు.

రోటరీ సేవలపై విస్తృత ప్రదర్శన

తెనాలి: రోటరీ ప్రచార కార్యక్రమంలో భాగంగా రోటరీ క్లబ్ ఆఫ్ తెనాలి వైకుంఠపురం ఆధ్వర్యంలో శనివారం క్లబ్ సభ్యులు పట్టణంలో ప్రదర్శన చేశారు. రోటరీలో కొత్త సభ్యులను చేర్చుకోవటం, కొత్తగా క్లబ్బులు ఏర్పాటుపై ప్రజల్లో అవగాహన కల్పించే ఉద్దేశంతో ఈ ప్రదర్శన నిర్వహించారు. క్లబ్ అధ్యక్షుడు నల్లూరు వెంకటేశ్వరరావు మాట్లాడుతూ సమాజసేవపై ఆసక్తి కలిగిన వివిధ రంగాల ప్రజలు రోటరీలో భాగస్వాములు కావాలని సూచించారు. ప్రపంచవ్యాప్తంగా పోలియో నిర్మూలనకు రోటరీ ఇంటర్నేషనల్ చేస్తున్న అద్భుత సేవను గుర్తుచేశారు. అంతేకాకుండా సమాజంలో వివిధ రకాలైన వ్యక్తులు, విద్యార్థులకు అవసరమైన వసతుల ఏర్పాటుకు, మహిళల స్వాలంబనకు, పర్యావరణ పరిరక్షణతో సహా పలు రకాల సేవలను నిర్వహిస్తున్నట్టు తెలిపారు. వ్యక్తిగతంగా కన్నా సామూహికంగా చేసే సేవకు ఫలితం ఎక్కువగా ఉంటుందన్నారు. ప్రదర్శనలో అసిస్టెంట్ గవర్నర్ ఈదర వెంకట పూర్ణచంద్, కార్యదర్శి గుమ్మడి వెంకటనారాయణ, కోశాధికారి వెంపటి హరిప్రసాద్, మెంబర్‌షిప్ చైర్ మల్లాది అర్జున, గుత్తా వెంకటరత్నం, కన్నెగంటి మురళీకృష్ణ, డాక్టర్ డి రవీంద్రనాథ్, వీరవల్లి మురళి, కనగాల నాగభూషణం, గుమ్మడి ప్రసాద్, ఆలపాటి కిరణ్, వీరవల్లి శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

కిల్కారి కాల్స్ సేవలు వినియోగించుకోవాలి



పెదకాకాని: మాత శిశు మరణాలు తగ్గించడానికి కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి సురక్షిత్ మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా కిల్కారి కాల్స్ ప్రవేశ పెట్టిందని ప్రోగ్రాం ఆఫీసర్ బి.రాజు తెలియజేశారు. మండల కేంద్రమైన పెదకాకానిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శనివారం ఆరోగ్య పరీక్షలకు వచ్చిన గర్భిణులకు కిల్కారి కాల్ గురించి అవగాహన కలిపించారు. కిల్కారి కాల్ యొక్క ప్రాముఖ్యత గురించి వివరించారు. కిల్కారి కాల్ సూచనలు పాటిస్తే సుఖ ప్రసవంతో పాటు తల్లి, బిడ్డ క్షేమంగా ఉంటారన్నారు. కిల్కారి కాల్స్ గర్భిణులకు 4వ నెల మొదలుకొని, బిడ్డ పుట్టిన సంవత్సరం వరకు వస్తాయన్నారు. ఈ కిల్కారి వాయిస్ కాల్స్ వారానికి ఒకసారి గర్భిణులు, బాలింతల మొబైల్స్‌కి వస్తాయన్నారు. గర్భిణులు, బాలింతలు కిల్కారి కాల్ నెంబర్ 01244451660ను తమ ఫోన్లలో సేవ్ చేసుకోవాలని సూచించారు. డాక్టర్ ప్రవీణ దీప్తి, పీహెచ్‌ఎన్ పద్మ, ఎంపీహెచ్‌ఎస్ సుకుమార్, హెచ్‌వి దేవి, మండలంలోని ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

తూతూమంత్రంగా కాలువ కట్టల బలోపేతం పనులు

- సామర్థ్యానికి మించి పశ్చిమ బ్యాంక్ కెనాల్‌కు నీరు విడుదల
- కట్టలు దాటి రోడ్లపైకి చేరుతున్న నీరు
- పలుచోట్ల పంట పొలాలు మునక
- రైతులు ఆందోళన



కొల్లూరు స్నానాల రేవు ప్రాంతంలో కాలువ కట్టపైకి చేరిన నీరు

కొల్లూరు: కాలువ కట్టల బలోపేతం పనులు తూతూ మంత్రంగా నిర్వహించడంతోపాటు సామర్థ్యానికి మించి విడుదల చేయడంతో పంటలకు అందాల్సిన నీరు రోడ్లపైకి చేరుతుంది. అంతేగాక వెద పద్ధతిలో సాగు చేసిన పంట పొలాలు నీట మునిగాయి. ఫలితంగా పంటలు దెబ్బతిన్నాయి. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. వేలాది ఎకరాలకు సాగు నీరు సరఫరా జరిగే పశ్చిమ బ్యాంక్ కెనాల్ కాలువ కట్టల బలోపేతం పనులతో తూతూ మంత్రంగా ముగించారు. ప్రస్తుతం కాలువ పూర్తి సామర్థ్యంతో నీటి విడుదల కారణంగా భట్టిప్రోలు మండలం వెల్లటూరులో రోడ్లపైకి కాలువ నీరు చేరింది. ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. బలహీనంగా ఉన్న కాలువ కట్టలకు మరమ్మతులు చేపట్టకుండా ఇదే తరహాలో నీటి విడుదల కొనసాగిస్తే కోతకు గురయ్యే ప్రమాదం ఉందని ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు. తక్షణం నీటిపారుదల శాఖాధికారులు స్పందించి కాలువ కట్టలను బలోపేతం చేసేందుకు తగిన చర్యలు చేపట్టాలని రైతులు, ప్రజలు కోరుతున్నారు.

కాలువ కట్టలను బలోపేతం చేసుకోవాలి

ఇరిగేషన్, వ్యవసాయ శాఖ అధికారులు



నీట మునిగిన ప్రాంతాలను పరిశీలిస్తున్న ఇరిగేషన్, వ్యవసాయశాఖాధికారులు

కొల్లూరు: కాలువ కట్ట వెంబడి పొలాలు ఉన్న రైతులు నీరు తగ్గిన వెంటనే కట్టలను బలోపేతం చేసుకొని పంట మునకకు గురవ్వకుండా జాగ్రత్తలు తీసుకోవాలని నీటిపారుదల శాఖ, వ్యవసాయ శాఖాధికారులు సూచించారు. కొల్లూరు స్నానాల రేవు ప్రాంతంలో కరకట్ట ఆనుకొని ఉన్న పంట పొలాలు పశ్చిమ బ్యాంక్ కెనాల్ పొంగి పొర్లడం కారణంగా మునకకు గురయ్యాయి. 'సాక్షి'లో శనివారం 'పంట పొలాలు మునక' శీర్షికతో కథనం ప్రచురితమైన విషయం విదితమే. నీటిపారుదల శాఖ, వ్యవసాయ శాఖ అధికారులు ఆ ప్రాంతాన్ని పరిశీలించి పంటలు మునకకు గురైన విషయాన్ని నిర్ధారించారు. దిగువ ప్రాంతాలైన భట్టిప్రోలు, నగరం, రేపల్లె, నిజాంపట్నం మండలాలకు సాగు నీరు అందించేందుక కాలువ పూర్తి సామర్థ్యం మేరకు నీటిని విడుదల చేశామని, దీంతో కాలువ పొంగి పొర్లుతుందన్నారు. దీనికి తోడు కొల్లిపర ప్రాంతంలో కాలువకు గండి పడటంతో నీటి విడుదల స్థాయి పెరుగుతుందన్నారు. కాలువ నీటి విడుదల పరిమాణం తగ్గిన వెంటనే రైతులు కాలువ కట్టలను బలోపేతం చేసుకొని మునకకు గురవ్వకుండా కాపాడుకోవాలని సూచించారు.

డ్రోన్ కెమెరాలతో నిరంతర నిఘా



డ్రోన్ ద్వారా హార్బర్ పరిసర ప్రాంతాలను పరిశీలిస్తున్న ఎస్సై కందుల తిరుపతిరావు

నిజాంపట్నం: నేరాల నియంత్రణకు, మండల ప్రాంతం నిరంతర పర్యవేక్షణకు డ్రోన్ కెమెరా ద్వారా పర్యవేక్షిస్తున్నామని నిజాంపట్నం ఎస్సై కందుల తిరుపతిరావు తెలిపారు. డ్రోన్ కెమెరా ద్వారా శనివారం నిజాంపట్నం హార్బర్ నుంచి ఆయన పరిసర ప్రాంత గ్రామాలను పర్యవేక్షించారు. బహిరంగ ప్రదేశాలలో మద్యపానం, జూదాల నిర్వహణ, అసాంఘిక కార్యక్రమాలను నివారించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టామన్నారు. నిరంతరం గ్రామాలపై డ్రోన్ కెమెరా నిఘా ఉంటుందన్నారు. మండలంలో ఎవరైనా అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే వెంటనే తమకు సమాచారం అందుతుందన్నారు. కోడిపందేలు, జూదం నిర్వహించేవాళ్లు ఇకనుంచి పోలీసు కంటి చూపు నుంచి తప్పించుకోలేరని అన్నారు. డ్రోన్ సహాయంతో మండలం మొత్తం నిఘా నేత్రంలో ఉంటుందని ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రజలు కూడా తమ పరిధిలో జరుగుతున్న అసాంఘిక కార్యక్రమాలను పోలీసులకు తెలియజేయాలని కోరారు.

అపర ధన్వంతరి యల్లాప్రగడ సుబ్బారావు



యల్లాప్రగడ సుబ్బారావు చిత్రపటానికి పూలదండ వేసి నివాళి అర్పిస్తున్న నాయకులు

బాపట్ల అర్బన్: అలోపతి మందులను సహజంగా ఇంగ్లీషు మందులు అంటుంటారని వాటిలో అతి కీలకమైన మందులు కనుగొన్నది మన అచ్చ తెలుగు వాడైనా యల్లాప్రగడ సుబ్బారావు అని ఫ్రీడమ్ ఫైటర్స్ మెమోరియల్ క్లినిక్ వ్యవస్థాపకులు, ప్రజాకవి డాక్టర్ ఎస్ శ్రీనివాస్ కొనియాడారు. బాపట్ల జమేదారు పేటలోని సాహితీ భారతి కార్యాలయంలో జరిగిన యల్లాప్రగడ సుబ్బారావు వర్ధంతి సభకు శ్రీనివాస్ అధ్యక్షత వహించారు. డాక్టర్ సుబ్బారావు ఫోలిక్ ఆమ్లం నిజస్వరూపాన్ని కనుగొన్నారన్నారు. బసోనికోటి నికాసిడ్, హైడ్రాక్సైడ్ మందులను కనుగొని క్షయ బోధకాలు టైఫాయిడ్ పాండు రోగం స్ప్రూ(కంఠసర్పి) వంటి ప్రాణాంతక వ్యాధులను రూపుమాపారని అన్నారు. ప్రపంచంలోనే తొలిసారిగా టెట్రాసైక్లిన్ యాంటీబయాటిక్ అరియోమైసిన్ కనుగొన్నారని తెలియజేశారు. సాహితీ భారతి అధ్యక్షులు రావూరి నరసింహవర్మ మాట్లాడుతూ పూర్వం మందు లేని స్ప్రూ, క్షయ వ్యాధి కారణంగా ఎందరో ప్రాణాలు కోల్పోయే వారని అటువంటి ప్రాణాంతక వ్యాధులకు మందు కనుగొని ఎందరికో ప్రాణదానం చేసిన ప్రాణదాత సుబ్బారావు అని అన్నారు. సాహితీ భారతి కోశాధికారి ఆదం షఫీ మాట్లాడుతూ అమెరికా పౌరసత్వాన్ని నిరాకరించి నోబెల్ ప్రైజ్ వచ్చే అవకాశం కూడా వదులుకున్న నిజమైన భారతీయుడు, దేశభక్తుడు సుబ్బారావు అని ప్రశంసించారు. సభలో కీర్తి వెంకట్ ఎం జాకబ్ ఎం.మాల్యాద్రిరావు, కస్తూరి శ్రీనివాసరావు, దగ్గుమల్లి శామ్యూల్, బొద్దుపల్లి శ్రీరామచంద్రమూర్తి, కే కాళిదాసు తదితరులు పాల్గొన్నారు. యల్లాప్రగడ సుబ్బారావు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు.

సామూహిక కుంకుమ పూజలు



సామూహిక కుంకుమ పూజలో పాల్గొన్న భక్తులు

రేపల్లె: తిరుమల తిరుపతి దేవస్థానం ఆర్థిక సహకారంతో సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో పోటుమెరక గ్రామంలోని వేంకటేశ్వరస్వామి దేవాలయంలో శనివారం శ్రావణ పౌర్ణమిని పురస్కరించుకొని స్వామివారికి ప్రత్యేక పూజా కార్యక్రమం, శ్రీలక్ష్మీ అమ్మవారి సామూహిక కుంకుమ పూజా కార్యక్రమాలు నిర్వహించారు. బాపట్ల జిల్లా ధర్మ ప్రచారక్ జంజనం హేమశంకరరావు మాట్లాడుతూ ఐశ్వర్య ప్రదాయిని శ్రీలక్ష్మీ అమ్మవారిని శ్రావణమాసంలో పూజించటం వలన సకల సౌభాగ్యాలు కలిగి ఆర్థిక బాధలు తొలగి శుభాలు కలుగుతాయని తెలిపారు. శ్రీ వెంకటేశ్వరస్వామి సంపూర్ణ కరుణాకటాక్షాలు లభిస్తాయన్నారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలుచేశారు. భక్తులకు అన్నప్రసాద కార్యక్రమం నిర్వహించారు.

దేశమాంబ అమ్మవారికి శ్రావణపౌర్ణమి పూజలు

మంచాల(చేబ్రోలు): మంచాల గ్రామంలోని గ్రామ దేవత దేశాంబ అమ్మవారికి శనివారం శ్రావణ పౌర్ణమి సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. పంటలు సమృద్ధిగా పండాలని, గ్రామం సుఖఃశాంతులతో ఉండాలని కోరుతూ జరి గిన ప్రత్యేక పూజలకు గ్రామస్తులతోపాటు, వివిధ గ్రామాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.